RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in

# దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | సెప్టెంబర్ 10 గురువారం 2026 | సంపుటి : 16 | సంచిక : 217 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | THURSDAY SEPTEMBER 10 2026 | VOL:16 | ISSUE: 217 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:SAYED PASHA

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర.. కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

- స్పీకర్‌ను దూషించడంపై రేవంత్ ఆగ్రహం
- ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని వెల్లడి
- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారని విమర్శ
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదని వ్యాఖ్య



అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు.

## పోలీసులు దాడి చేసిన తీరును గవర్నర్‌కు వివరించాం : కేటీఆర్

అసెంబ్లీ ముందు మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేసిన దాడి చేసిన తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆధ్వర్యంలో ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గవర్నర్ శుక్లాకు ఫిర్యాదు చేశారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ లాంటి పరిస్థితిని వివరించడానికి వారిని సమయం అడిగాం.. మాకు సమయం ఇచ్చారు. వారికి మా పార్టీ పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. వారికి చిన్న ఆరోగ్యసమస్య వచ్చింది.. వారు సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా మా పార్టీ తరపున ఆకాంక్షను తెలియజేశామన్నారు. ఇవాళ ఈ రాష్ట్రంలో నెలకొన్ని అన్ని పరిస్థితులను గవర్నర్‌కు కూలంక షంగా మా పార్టీ శాసనసభ్యులు, శాసన మండలిలో ప్రతిపక్ష నాయకులు, ఉప నాయకులు, సీనియర్ నాయకులు అంతా కలిసి చాలా వివరంగా



(మిగతా 2వ పేజీలో..)

## అసెంబ్లీలో బీఆర్ఎస్‌కు షాక్.. కేటీఆర్, హరీశ్‌రావు సహా సభ్యుల సస్పెన్షన్

- ఎర్రవల్లి వద్ద 'చావుడప్పు' నిరసనలపై బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన
- సభను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపణ
- బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌పై తీర్మానం
- సభ జరిగే అన్ని రోజులకూ సస్పెన్షన్ వర్తింపు
- అనంతరం సభ 10 నిమిషాలు వాయిదా



తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, కోవా లక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితో పాటు (మిగతా 2వ పేజీలో..)

## ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

- ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి
- ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు

ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో (మిగతా 2వ పేజీలో..)



## గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ



బీఆర్ఎస్ వర్కింగ్ (మిగతా 2వ పేజీలో..)

## కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి.. అసెంబ్లీలో తీవ్ర దుమారం

- నిన్న కేసీఆర్ ఫాంహౌస్ వద్ద నిరసన తెలిపిన కాంగ్రెస్ ఎస్సీ విభాగం, దళిత సంఘాలు
- ఆ ప్రాంతాన్ని బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేశారన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్
- దళితుల పట్ల వివక్షను బీఆర్ఎస్ మరోసారి నిరూపించుకుందని మండిపాటు

తెలంగాణ శాసనసభ మూడో రోజు సమావేశాలు ప్రారంభం కాగానే సభలో తీవ్ర దుమారం చెలరేగింది. నిన్న సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతలు, దళిత సంఘాలు నిరసన తెలిపిన అనంతరం... బీఆర్ఎస్ నేతలు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేశారంటూ మంత్రి (మిగతా 2వ పేజీలో..)



## ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు

- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్
- బీఆర్ఎస్ సభ్యులను కక్షపూరితంగా సస్పెండ్ చేశారన్న హరీశ్
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే కుట్రలు చేస్తున్నారని మండిపాటు

తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. "ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి' అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే ప్రతిపక్షం గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నియంతృత్వం ఎంత పెరిగితే.. ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుంది అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని ఆయన హెచ్చరించారు.



RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



## సంపాదకీయం

### పట్టణాల అభివృద్ధి.. ప్రజల జీవన ప్రమాణాలే కొలమానం!

నగరాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయంటే కేవలం ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, మెరిసే కార్యాలయాలు కనిపించడం మాత్రమే కాదు. అక్కడ నివసించే సామాన్య ప్రజలకు జీవితం ఎంత సులభమైంది? వారికి తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, విద్యుత్, వైద్యం వంటి మౌలిక వసతులు ఎంత మెరుగయ్యాయి? అనే అంశాలే నిజమైన అభివృద్ధికి కొలమానం.ప్రస్తుతం పట్టణీకరణ వేగంగా పెరుగుతోంది. గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరగడంతో జనాభా ఒత్తిడి కూడా అధికమవుతోంది. దీనికి అనుగుణంగా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సరఫరా, ప్రజా రవాణా వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే అభివృద్ధి పేరుతో చేపట్టే నిర్మాణాలు భవిష్యత్‌లో కొత్త సమస్యలకు కారణమయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వర్షాకాలంలో పట్టణాల్లో ఎదురయ్యే వరదలు, రహదారులపై నిలిచిపోయే నీరు, ట్రాఫిక్ సమస్యలు పాలనకు సవాల్‌గా మారుతున్నాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి రోడ్లు నిర్మించినా కొద్దిపాటి వర్షానికే అవి దెబ్బతింటే నిర్మాణ నాణ్యతపై ప్రశ్నలు తలెత్తడం సహజం. అందుకే ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నిర్వహణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.అభివృద్ధి ప్రణాళికల్లో సామాన్యుల అవసరాలకు స్థానం కల్పించాలి. పాదచారులకు ఫుట్‌పాత్‌లు, వృద్ధులు మరియు దివ్యాంగులకు అనుకూలమైన మార్గాలు, మహిళలకు సురక్షితమైన ప్రజా ప్రదేశాలు, పిల్లలకు ఆటస్థలాలు అందుబాటులో ఉండాలి. పార్కులు, చెట్ల పెంపకం, చెరువుల పరిరక్షణ వంటి అంశాలను కూడా పట్టణ ప్రణాళికలో భాగం చేయాలి.అధికార యంత్రాంగం మాత్రమే కాదు.. ప్రజలకు కూడా బాధ్యత ఉంది. రోడ్లపై చెత్త వేయకుండా, ప్రభుత్వ ఆస్తులను కాపాడుతూ, నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ అభివృద్ధి కార్యక్రమం కూడా పూర్తిస్థాయిలో విజయవంతం కాదు. అభివృద్ధి అంటే భవనాల ఎత్తు కాదు.. ప్రజల జీవన ప్రమాణాల ఎత్తు. పాలకులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ, ప్రజలు బాధ్యతాయుతంగా సహకరిస్తేనే సుస్థిరమైన పట్టణాభివృద్ధి సాధ్యమవుతుంది. అప్పుడే అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికీ చేరి.. పట్టణ జీవనం మరింత సౌకర్యవంతంగా మారుతుంది.

# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

మొదటి పేజీ తరువాయి)

ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

## పోలీసులు దాడి చేసిన తీరును గవర్నర్‌కు వివరించాం : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

గవర్నర్‌కు చెప్పామన్నారు.కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనలో ప్రజలకు అన్యాయమే జరిగిందని నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలుపుతుంటే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీకి రానివ్వకుండా పోలీసులు దాడి చేసిన తీరును, తెలంగాణలో పరిస్థితులను గవర్నర్‌కు వివరించామన్నారు. శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డిపై పురుష పోలీసుల దాడి వీడియోలను చూపించాం. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను తెలిపామన్నారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగి దుశ్శాసనపర్వం ఎలా సృష్టించారో చెప్పామన్నారు. కేసీఆర్ చావు కోరుతూ ఎలా మాట్లాడారో గవర్నర్‌కు చెప్పామన్నారు.

మేం చేసిన తప్పేంటి..?

రూల్స్ కు విరుద్ధంగా తమ ఎమ్మెల్సీలను ఎలా సస్పెండ్ చేశారో గవర్నర్ శుక్లాకు చెప్పామన్నారు కేటీఆర్ . గౌరవ సభ కాదది, కౌరవ సభ, శాసన సభ కాదు.. దుశ్శాసన సభ, అదే విషయాన్ని గవర్నర్‌కు వీడియోలతో సహా వివరించామన్నారు. సభ బయట అంశాలపై డీజీపీ, సీపీతో గవర్నర్ మాట్లాడతానన్నారని వెల్లడించారు. ఫామ్ హౌస్‌కు కాంగ్రెస్ గూండాలు ఎలా వెళ్లారో గవర్నర్‌కు చెప్పామన్నారు. రాహుల్ గాంధీ తరహాలోనే బ్లాక్ టీషర్ట్ వేసుకున్నాం. మేం చేసిన తప్పేంటి.. తెలంగాణలో పరిస్థితులను గవర్నర్ శుక్లాకు వివరించాం. రాష్ట్రంలో ప్రజలకే కాదు.. ప్రజా ప్రతినిధులకూ అవమానాలే ఎదురవుతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు.

## ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా: సీఎం చంద్రబాబు

సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు మూల మంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితమై పనిచేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని, దానికోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని మాచడవ పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి వారం ప్రజల వద్దకే వస్తున్నానని, వారి బాగోగులు తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నానని తెలిపారు.ప్రతినెలా ఒకటో తేదీన పేదల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. అలాగే, ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో, నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని, తద్వారా ప్రజలంతా గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

భూమికి భద్రత.. గత ప్రభుత్వ పాపాల ప్రక్షాళన

ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు, యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని సీఎం తెలిపారు. భూమిపై యజమానులకు తిరుగులేని హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని, రికార్డులను తారుమారు చేసి ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూములను కాజేసేందుకు కుట్ర పన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రమాదకర చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా ఇచ్చిందని గుర్తుచేశారు."రీసర్వే పేరుతో గత ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై కూడా తమ ఫొటోలు వేసుకున్నారు. అందుకే ఇప్పుడు పటిష్ఠమైన రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ఎక్కడా అవకతవకలకు తావులేకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నాం"అని చంద్రబాబు వివరించారు.

రికార్డు స్థాయిలో రెవెన్యూ సంస్కరణలు

భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, 36 లక్షల మందికి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 8,582 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి మొత్తం 56 లక్షల పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని కేవలం రూ.1000కి పరిమితం చేయడం ద్వారా 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి లక్షలాది మందికి ఊరట కల్పించామని అన్నారు. శెట్టిపల్లి కంగుంది, వట్టిచెరుకూరు, ముదినేపల్లి వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని తెలిపారు. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురంలో బ్రిటిష్ కాలం నాటి (1908) 22ఏ(1) నిషేధిత భూముల సమస్యను కూడా పరిష్కరిస్తున్నామని, దీని ద్వారా 1410 మందికి చెందిన 56.37 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నామని ప్రకటించారు. "గొడ్డలి పార్టీ తారుమారు చేసిన రికార్డులను ప్రక్షాళన చేసి భూ సమస్యలను కొలిక్కి తెస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రజల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం

భూమి భద్రతతో పాటు నీటి భద్రతకు కూడా తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం అన్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ, గోదావరి నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలో వృథాగా కలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ కక్షతో కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లే పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు ఆలస్యమైందని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఢిల్లీలో సంజీవనిలా పనిచేసిందని, కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన గ్రిడ్ ఆధునీకరణ, 3-ఫేజ్ విద్యుత్ సరఫరా పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీశ్, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో బీఆర్ఎస్‌కు షాక్.. కేటీఆర్, హరీశ్‌రావు సహా సభ్యుల సస్పెన్షన్

మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఈ సెషన్‌లో సభ జరిగే అన్ని రోజులకు ఈ సస్పెన్షన్ వర్తించనుంది.సభ ప్రారంభమైన కొద్దిసేపటికే బీఆర్ఎస్ సభ్యులు నిన్నటి ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద 'చావుడప్పు' నిరసనలపై ఆందోళనకు దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు.దాదాపు గంటసేపటి నుంచి బీఆర్ఎస్ సభ్యులు సభను అడ్డుకుంటున్నారని మంత్రి తెలిపారు. వారిని సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది.దీంతో బీఆర్ఎస్ సభ్యులను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.

## ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

మొదటి పేజీ తరువాయి)

కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

## కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి.. అసెంబ్లీలో తీవ్ర దుమారం

మొదటి పేజీ తరువాయి)

అడ్లూరి లక్ష్మణ్ సభలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు నిరసన తెలిపి వెళ్లిన స్థలాన్ని శుద్ధి చేయడం వెనుక బీఆర్ఎస్ నాయకుల తీవ్రమైన కులతత్వం బయటపడిందని... ఇది యావత్ దళిత సమాజ ఆత్మగౌరవాన్ని, హక్కులను తీవ్రంగా అవమానించడమేనని విమర్శించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీ గేటు వద్ద బూతులు తిట్టిన అంశాన్ని మరిచిపోకముందే... బీఆర్ఎస్ మరోసారి దళితుల పట్ల తమకున్న వివక్షను నిరూపించుకుందని మండిపడ్డారు. ఈ శుద్ధి వ్యవహారంపై సభలో సమగ్ర చర్చ జరగాలని ఆయన పట్టుబట్టారు. మరోవైపు, మంత్రి ప్రసంగానికి అడ్డుతగులుతూ బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై, వారిపై జరిగిన అనుచిత ప్రవర్తనపై ప్రభుత్వం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఇరువైపులా నేతల పోటాపోటీ నినాదాలు, హంగామాతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.



RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# క్లిష్ట గుండె సమస్యతో బాధపడుతున్న 78 ఏళ్ల వృద్ధుడికి టావీ ద్వారా విజయవంతమైన చికిత్స

**వరంగల్, 9 సెప్టెంబర్, 2026:**

బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్‌తో పాటు తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్, గణనీయమైన అసెండింగ్ అయోర్టిక్ డైలటేషన్‌తో బాధపడుతున్న 78 ఏళ్ల పురుష రోగికి ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ (టావీ - TAVI) ద్వారా విజయవంతంగా చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు. బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్ అనేది పుట్టుకతో వచ్చే గుండె సంబంధిత లోపం. సాధారణంగా అయోర్టిక్ వాల్వ్‌లో మూడు లీఫ్లెట్లు (కవాటాలు) ఉండగా, ఈ పరిస్థితిలో రెండు మాత్రమే ఉంటాయి. కాలక్రమేణా ఈ అసాధారణ నిర్మాణం కారణంగా వాల్వ్ క్రమంగా ఇరుకుగా మారి తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్‌కు దారితీస్తుంది. దీంతో గుండెపై అదనపు ఒత్తిడి పడుతుంది. ఈ రోగిలో బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్‌తో పాటు అసెండింగ్ అయోర్టా గణనీయంగా విస్తరించి ఉండటం, అలాగే అయోర్టా అడ్డంగా (హారిజాంటల్‌గా) ఉండటం వల్ల కేసు మరింత క్లిష్టంగా మారింది. ఈ సంక్లిష్ట శరీర నిర్మాణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని హార్ట్ టీమ్ సమగ్ర పరిశీలన, అధునాతన ఇమేజింగ్ పరీక్షలు, అత్యంత జాగ్రత్తతో కూడిన ప్రణాళికను రూపొందించింది. రోగి వయస్సు, ఆరోగ్య పరిస్థితి, క్లిష్టమైన శరీర నిర్మాణ లక్షణాలను పరిగణనలోకి తీసుకుని హార్ట్ టీమ్ టావీ విధానాన్ని ఎంచుకుంది. ఈ అత్యాధునిక, మినిమల్లీ ఇన్వేసివ్ విధానంలో తొడ భాగంలోని రక్తనాళం (ఫెమొరల్ ఆర్టరీ) ద్వారా కొత్త కృత్రిమ వాల్వ్‌ను గుండెకు చేరవేసి, దెబ్బతిన్న అయోర్టిక్ వాల్వ్ స్థానంలో అమర్చారు. ఈ క్లిష్టమైన టావీ ప్రక్రియను సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంతోష్ మోదాని విజయవంతంగా నిర్వహించారు. ఆయనకు బహుళ విభాగాల కార్డియాక్ బృందానికి చెందిన డాక్టర్ శ్రవణ్ కుమార్ రాంపల్లి, డాక్టర్ షఫీ, డాక్టర్ వాసు సహకారం అందించారు. ఓపెన్-హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. కొత్తగా అమర్చిన వాల్వ్ సమర్థవంతంగా పనిచేస్తుండగా, అయోర్టిక్ వాల్వ్ ద్వారా రక్తప్రసరణ గణనీయంగా మెరుగుపడింది. చికిత్స అనంతరం రోగి వేగంగా కోలుకుని ప్రస్తుతం ఆరోగ్యంగా, స్థిరమైన పరిస్థితిలో ఉన్నారు. ఈ క్లిష్టమైన కేసు ద్వారా అధునాతన స్ట్రక్చరల్ హార్ట్ ఇంటర్వెన్షన్లు, ఖచ్చితమైన శరీర నిర్మాణ అంచనా, బహుళ విభాగాల హార్ట్ టీమ్ సమన్వయంతో కూడిన వైద్య విధానం ద్వారా సంక్లిష్ట గుండె సమస్యలతో బాధపడుతున్న వృద్ధ రోగులకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని మరోసారి రుజువైంది. ముఖ్యంగా వృద్ధుల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శారీరక శ్రమను తట్టుకోలేకపోవడం, ఛాతీ నొప్పి, తల తిరగడం లేదా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్‌ను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం అత్యంత కీలకమని వారు పేర్కొన్నారు. ఈ విజయవంతమైన ఫలితం సరైన రోగి ఎంపిక, అధునాతన ఇమేజింగ్ సాంకేతికత, ఖచ్చితమైన ప్రణాళిక, అంకితభావంతో పనిచేసిన బహుళ విభాగాల కార్డియాక్ బృందం సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది.




# మరిపెడలో అర్హతలేని వైద్యం?

**పల్లె ప్రజల ప్రాణాలతో చెలగాటమా..!**

**ప్రైవేటు క్లినిక్‌లు, ల్యాబ్‌లపై తనిఖీలు ఏవీ? నిబంధనలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాలని ప్రజల డిమాండ్**

**దేశ టైమ్స్ మహబూబాబాద్/మరిపెడ, సెప్టెంబర్ 9:**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో ప్రైవేటు వైద్య సేవల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా కొందరు వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి అనారోగ్య సమస్యలతో వైద్యం కోసం మండల కేంద్రానికి వచ్చే ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అర్హతలు, అనుమతులు లేకుండానే క్లినిక్‌లు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్య రంగంలో అనుభవం, అర్హత, సంబంధిత రిజిస్ట్రేషన్ లేకున్నా డాక్టర్ పేరుతో బోర్డులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**చిన్న అనారోగ్యానికే వేలల్లో ఖర్చు?**

సాధారణ జ్వరం, తలనొప్పి, జలుబు వంటి చిన్నపాటి ఆరోగ్య సమస్యలకు కూడా కొన్నిచోట్ల అధిక మొత్తంలో బిల్లులు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యుడిని సంప్రదించిన అనంతరం అవసరమున్నా లేకున్నా వివిధ రకాల రక్త పరీక్షలు, ఇతర ల్యాబ్ పరీక్షలు చేయిస్తున్నారని, వాటి వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అవసరానికి మించి యాంటీబయాటిక్స్, ఇంజక్షన్లు, ఇతర మందులు సూచిస్తున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. అయితే ఆయా ఆరోపణలు వాస్తవమా? కాదా? అన్నది అధికారుల తనిఖీలతోనే తేలాల్సి ఉంది.

**ప్రథమ చికిత్సకే పరిమితమా..?**

ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితమైన అర్హతలు కలిగిన వ్యక్తులు పూర్తి స్థాయి వైద్య సేవలు అందిస్తున్నారా? ప్రిస్క్రిప్షన్లు రాస్తున్నారా? ఇంజక్షన్లు, మందులు విచక్షణ లేకుండా ఇస్తున్నారా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం ఎవరు ఎలాంటి వైద్య సేవలు అందించవచ్చనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు. ప్రైవేటు క్లినిక్‌లలో వైద్య సేవలు అందించే వారి విద్యార్హతలు, వైద్య మండలి రిజిస్ట్రేషన్, క్లినిక్ నిర్వహణకు ఉన్న అనుమతులు, ల్యాబొరేటరీల అనుమతులు తదితర అంశాలను అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

**ల్యాబ్‌ల నిర్వహణపైనా దృష్టి పెట్టాలి**

క్లినిక్‌లతో పాటు కొన్ని ప్రైవేటు ల్యాబొరేటరీల నిర్వహణపైనా పర్యవేక్షణ అవసరమని ప్రజలు అంటున్నారు. పరీక్షలు నిర్వహించే సిబ్బందికి అర్హతలు ఉన్నాయా? పరీక్షల ఫలితాలను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? సంబంధిత అనుమతులు ఉన్నాయా? అనే అంశాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. వైద్యం పేరుతో ప్రజల ఆరోగ్యంతో ఎలాంటి ప్రయోగాలు జరగకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని, నిబంధనలకు అనుగుణంగా నడుస్తున్న వైద్య సంస్థలకు ఇబ్బందులు కలగకుండా, నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలపై మాత్రమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




**అధికారుల తనిఖీలు ఎక్కడ?**

మరిపెడ మండల కేంద్రంలో ప్రైవేటు క్లినిక్‌లు, ల్యాబ్‌లు పెరుగుతున్నప్పటికీ వాటిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా? నిర్వహిస్తే ఎన్ని సంస్థలను పరిశీలించారు? నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇటీవల జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్న కేంద్రాలపై అధికారులు చర్యలు తీసుకున్న నేపథ్యంలో మరిపెడలోనూ ఇదే తరహాలో సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా ముందస్తుగా ఆకస్మిక తనిఖీలు చేపడితే అర్హతలేని వైద్యాన్ని అరికట్టే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

**ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచాలి**

ప్రైవేటు వైద్యంపై ఆధారపడకుండా పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, మందులు, రక్త పరీక్షలు, ఇతర ప్రాథమిక వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు అందుబాటులో ఉంటే అధిక ఖర్చుతో కూడిన ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి తగ్గుతుందని వారు పేర్కొంటున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

మరిపెడ మండల కేంద్రంలోని అన్ని ప్రైవేటు క్లినిక్‌లు, ల్యాబొరేటరీలపై ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, వైద్యుల అర్హతలు, రిజిస్ట్రేషన్, అనుమతులు, నిర్వహణ విధానం తదితర అంశాలను పరిశీలించాలని ప్రజలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే పరిస్థితులకు తావులేకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా అధికారులు ఇప్పటికైనా స్పందించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని మరిపెడ మండల ప్రజలు కోరుతున్నారు.

# ఎమ్మార్పీఎస్ మరియు ఎం ఎస్ పి జాతీయ సదస్సు లో పాల్గొన్న రుద్రంగి ఎమ్మార్పీఎస్ నాయకులు

**రుద్రంగి సెప్టెంబర్ 9(దేశ టైమ్స్)**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ లో సత్యసాయి కన్వెన్షన్ హాల్లో జరిగిన ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సులో రుద్రంగి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. వరంగల్ లో జాతీయ సదస్సుకు నలుమూలల నుండి వేలాదిగా మాదిగలు, ఎమ్మార్పీఎస్ శ్రేణులు హాజరయ్యారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు రుద్రంగి మండలం నుండి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లి జాతీయ సదస్సును విజయవంతం చేశారు. ఈ సభలో రుద్రంగి మండల ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ దయ్యాల నారాయణ, సీనియర్ నాయకుడు నరేష్, హనుమంతు లక్ష్మీరాజం, జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ బిక్షపతి, ఎమ్మెస్పీ జిల్లా ఇంచార్జ్ కానాపురం లక్ష్మణ్, అడ్వకేట్ బొడ్డు నరేష్, రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్, గుండా థామస్, లక్ష్మణ్, సామెల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ సుదీర్ఘంగా 30 సంవత్సరాల పోరాట ఫలితమే వర్గీకరణ సాధించుకున్నాం మరియు ఇతర సామాజిక అంశాల పట్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటాం మరియు ఎమ్మార్పీఎస్ మండలాలలో మరియు జిల్లాలలో నూతన అధ్యక్షులను నియమించుకొని అక్టోబర్ 7న ఆంధ్రప్రదేశ్ అమరావతిలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు



# కరెంట్ కోతలపై బిజెపి నాయకుల ఆగ్రహం/ఎండిన పంట పొలాల పరిశీలన

**రుద్రంగి సెప్టెంబర్ 9 (దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు కర్ణావత్తుల వేణు ఆధ్వర్యంలో కరెంట్ కోతలపై నిరసన తెలిపారు. అనంతరం కరెంట్ కోతల వల్ల ఎండిన పంట పొలాలను పరిశీలించారు. నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చెప్పడమే తప్ప నాణ్యమైన విద్యుత్ రైతులకు అందడం లేదని అన్నారు. ఎమ్మెల్యే చెప్పినప్పటికీ కరెంట్ కోతలు తప్పడం లేదని అన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు కోట్ల రూపాయలు తెస్తున్నాం నాణ్యమైన విద్యుత్ అందిస్తాం అని చెప్పుకుంటూ పాలాభిషేకలు కొబ్బరికాయలు కొట్టి సబ్‌స్టేషన్ లు ట్రాన్స్ఫార్మర్లు మార్చడమే తప్ప చేసేదేమీ లేదని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు బిజెపి నాయకులను విమర్శించే ముందు ఆలోచించాలని అన్నారు. గ్రామంలో జరిగిన సిసి రోడ్లు డ్రైనేజీలు కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ఇచ్చిన నిధులతోనే జరిగాయని అన్నారు. ఎమ్మెల్యే నిధులు రాష్ట్ర ప్రభుత్వ నిధులు గ్రామ పంచాయతీ కి రావడం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ నిధులు ఇస్తేనే గ్రామ పంచాయతీ నడుస్తుందని అన్నారు. బిజెపి నాయకులు అభివృద్ధి కి సహకరిస్తారే కానీ అడ్డుకోరని అన్నారు. ఆకాశమంత హామీలు ఇచ్చి అవగింజంత అభివృద్ధి చేయలేరు కాబట్టి మీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో, ఉపాధ్యక్షుడు గండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్యాల శ్రీనివాస్, అల్లూరి రవీందర్ రెడ్డి, అక్కినపెల్లి నర్సింగరావు, బసాని దాయనందం, గెంటే మల్లయ్య, నేవురి కిషన్, లావుడ్యా శ్రీనివాస్, కాసోజి వంశీ, లావుడ్యా మహిపాల్, దరిపెల్లి మల్లయ్య, పాల్గొన్నారు...

# బిఆరెస్ పార్టీ నాయకుల వ్యాఖ్యలను / ఖండించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**రుద్రంగి సెప్టెంబర్ 9 (దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి బిఆరెస్ పార్టీ నాయకులు నిన్నటి రోజున కాంగ్రెస్ పార్టీపై ఎమ్మెల్యే పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గండి నారాయణ, మార్కెట్ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ జడ్పిటిసి గట్ల మీనయ్య, కొమిరె శంకర్ మాట్లాడుతూ. అవకాశవాదంతో కాదు అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరినం రుద్రంగి వ్యక్తి ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే అయ్యాడు అభివృద్ధి జరుగుతుంది దానిలో భాగస్వాములుగా ఉండలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలో చేరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వ్యక్తులను విమర్శించే ముందు మీ బిఆరెస్ ఇంచార్జ్ చల్మేడ లక్ష్మీ నరసింహారావు ఏ పార్టీ నుండి వచ్చారో గుర్తుంచుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో సర్పంచ్ ఎన్నికల్లో ఎంపీ ఎన్నికల్లో మున్సిపాల్ ఎన్నికల్లో మీ బిఆరెస్ పార్టీని ప్రజలు బొందపెట్టారని అన్నారు. అభివృద్ధి కి సహకరించుకుండా విమర్శలు చేయడం బిఆరెస్ పార్టీ నాయకుల నైజం అని అన్నారు. కొచ్చాగుట్ట తండా రోడ్డు కోసం రెండు కోట్లు మీ మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు సాంక్షన్ ఇచ్చారని అన్న మీరు ప్రొసీడింగ్ కాపీ ఎందుకు చూపెట్టడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధి కి బిఆరెస్ నాయకులు సహకరించకున్న పర్వాలేదు కానీ అడ్డుకోవద్దని హితువు పలికారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను తిడితేనే లీడర్లం అవుతామనే భ్రమలో ఉండి బిఆరెస్ నాయకులు మాట్లాడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే ను తిడితే లీడర్లు కారని ప్రజా సేవ అభివృద్ధి చేస్తే లీడర్లు అవుతారని అందుకె ప్రజలు బిఆరెస్ పార్టీని ఒడిస్తూ కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ విప్ చేసి అభివృద్ధి పనులను ప్రొసీడింగ్ పత్రాలను చూపిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో, ఎస్సిసెల్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు అక్కినపెల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్ రెడ్డి ఆత్మకమిటీ మెంబర్ కట్కూరి దాసు, వార్డ్ మెంబర్లు, లావుడ్యా సతీష్, గుగ్గిళ్ల వెంకటేష్, నాయకులు తర్రె లింగం, పుట్కపు మహేష్, చెలుకల తిరుపతి, పుదరి ప్రశాంత్, పొగుల మహేష్, పాల్గొన్నారు......

# గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఏజిఐ గ్లాస్ కంపెనీ ప్రత్యేక కృషి: ఏజిఐ గ్లాస్ కంపెనీ సిఎండి సుమితా సోనాలి

**వలిగొండ, సెప్టెంబర్ 09 (దేశ టైమ్స్):**

గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఏజిఐ గ్లాస్ కంపెనీ ప్రత్యేకంగా కృషి చేస్తుందని ఏజిఐ గ్లాస్ కంపెనీ సీఎండీ సుమితా సోనాలి అన్నారు. బుధవారం మండలంలోని కంచనపల్లి గ్రామంలో ఏజిఐ గ్లాస్ కంపెనీ తుక్కాపురం, భువనగిరి మండలం వారు నిర్వహించిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి, మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో పాటు ప్రజలకు త్రాగడానికి స్వచ్ఛమైన తాగు నీటిని అందించడానికి ఆర్ఓ వాటర్ ఫిల్టర్ ను అవసరమైన గ్రామాలకు అందిస్తున్నామని, రైతుల సంక్షేమం ఉచితంగా కూరగాయలు, విత్తనాలు, డ్రిప్, మల్చింగ్ పేపర్స్ ను అందిస్తున్నామని, ప్రజలకు అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతను అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రేసు బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఏజీఐ గ్లాస్ కంపెనీ వారు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని, గ్రామంలో ఆర్ఓ వాటర్ ఫిల్టర్ ఏర్పాటుతో పాటు వైద్య సౌకర్యం కోసం భవనం నిర్మాణానికి సహకరించాలని ఏజిఐ గ్లాస్ కంపెనీ సీఎండీ సుమితా సోనాలి కి వినతి పత్రం అందజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 120 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు నీల్ క్యాప్స్, బెల్టులు వృద్ధులకు ఊత కర్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజిఐ గ్లాస్ కంపెనీ జిఎం చైతన్య, ప్రతినిధులు గోవింద్ సింగ్, క్రాంతి, ఉపసర్పంచ్ ఈరపాక సుధాకర్, దేగల పాండరి, దొడ్డి బిక్షపతి, జక్క రాజేందర్ రెడ్డి, నిమ్మారెడ్డి లక్ష్మీకాంత్ రెడ్డి, ఎడమ నరసింహారెడ్డి, ఏజిఐ గ్లాస్ కంపెనీ, వైద్య సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



RNI NO . TELTEL2010/34557 తెలుగు దినపత్రిక

దేశ టైమ్స్

సత్యం కోసం .... సమాజం కోసం

# విద్యుత్ షాక్ తొ ఆవు మృతి



**వలిగొండ : సెప్టెంబర్ 09 (దేశ టైమ్స్)**




మండలంలోని ఎం తుర్కపెల్లి కి చెందిన రైతు బుర్ర రాములుకు చెందిన జెర్సీ ఆవు రోజు మాదిరిగా బుధవారం మెతకు వెల్లి అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మార్ కు వేలాడుతున్న జంపర్ వైర్కు ప్రమాద వశతు ఆవు తగిలి షాక్ తొ చనిపోయింది. ఆవు విలువ సుమారుగా ఒక లక్ష రూపాయల వరకు ఉంటుందని,ప్రభుత్వ పరంగా రైతును ఆదుకోవాలని పలువురు గ్రామస్థులు కోరారు

# శారీరక మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయి: ఎంపీడీవో జలంధర్ రెడ్డి





**వలిగొండ, సెప్టెంబర్ 09 (దేశ టైమ్స్):**

క్రీడలు శారీరక మానసిక వికాసానికి దుహదపడతాయని ఎంపీడీవో జలంధర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 బాలబాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ మండల స్థాయి విద్యార్థుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడోత్సవాలను ప్రారంభించి, మాట్లాడుతూ విద్యార్థుల చదువుతో పాటుగా క్రీడల్లో పాల్గొని రాణించాలని, పట్టుదలతో కృషి చేస్తే క్రీడాకారులు జిల్లా రాష్ట్రస్థాయిలో రాణించి మంచి పేరు తీసుకోవాలని, క్రీడలతో పోటీ తత్వం క్రమశిక్షణ అలవాడతాయని, క్రీడాకారులు మండల స్థాయిలో రాణిచ్చి జిల్లా స్థాయిలో జట్టులో చోటు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలి

**ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**దేశ టైమ్స్ మహబూబాబాద్ సెప్టెంబర్ 9**

తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరై, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాకవి కాళోజీ తెలంగాణ ఆత్మను, ప్రజల జీవనాన్ని, సామాజిక స్పృహను తన కవిత్వంలో ప్రతిబింబించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. తెలుగు మాత్రమే కాకుండా ఉర్దూ, హిందీ, మరాఠీ, ఆంగ్లం, తదితర భాషల్లో కూడా కవితలు రచించిన బహుభాషా కోవిదుడిగా కాళోజీ నిలిచారని తెలిపారు.సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేసిన ప్రజా కవిగా కాళోజీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై స్పందిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాళోజీ చేసిన కృషి అందరికీ ఆదర్శమని అన్నారు.కాళోజీ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1992లో పద్మ విభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసిందని గుర్తు చేశారు. ఒకసారి ఎమ్మెల్యేగా సేవలందించిన కాళోజీ ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు.జీవితాంతం మానవతా విలువలను ఆచరించిన కాళోజీ, మరణానంతరం కూడా తన అవయవాలను దానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కాళోజీ ఆశయాలు, మానవతా దృక్పథం, సామాజిక న్యాయం కోసం చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు.అదే విధంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, అధికారులు, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐడీఓసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ బాషిపంగు వెంకన్నకు పీహెచ్‌డీ పట్టా

**తెలంగాణ కథా సాహిత్యంపై పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం గుర్తింపు**

**దేశ టైమ్స్ మహబూబాబాద్ సెప్టెంబర్ 9**

ఎం జె పి కూసుమంచి బాలుర పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బాషిపంగు వెంకన్న ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ కాన్వకేషన్‌లో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. విశ్వవిద్యాలయంలో జరిగిన కాన్వకేషన్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. ములగారం కుమార్, ముఖ్య అతిథి భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ పట్టాను స్వీకరించారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో పీహెచ్‌డీ పర్యవేక్షకులు డాక్టర్ దాశరథుల నరసయ్య ఆధ్వర్యంలో "తెలంగాణ కథా సాహిత్యం -- ప్రాదేశిక వ్యక్తీకరణ" అనే అంశంపై డాక్టర్ బాషిపంగు వెంకన్న పరిశోధన పూర్తి చేశారు. తెలంగాణ ప్రాంతీయ జీవన విధానం, సామాజిక పరిస్థితులు, సంస్కృతి, భాష, ప్రజల జీవన అనుభవాలు కథా సాహిత్యంలో ఎలా ప్రతిఫలించాయనే అంశాలను పరిశోధనలో విశ్లేషించినట్లు తెలిపారు.ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే సాహిత్యంపై ఆసక్తితో ఉన్నత విద్యను అభ్యసించి పీహెచ్‌డీ పట్టా సాధించడం పట్ల విద్యావేత్తలు, సాహితీవేత్తలు, సహచరులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సాధించిన ఈ విద్యా విజయంతో కూసుమంచి ప్రాంతానికి, ఎం జె పి కూసుమంచి బాలుర పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు లభించిందని పలువురు పేర్కొన్నారు.పీహెచ్‌డీ పట్టా అందుకున్న సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం, ఎం జె పి కూసుమంచి ప్రిన్సిపల్ పెరబోయిన మల్లయ్య, కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, స్నేహితులు, స్టూడెంట్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు, పరిశోధక మిత్రులు, సాహితీవేత్తలు, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు డాక్టర్ బాషిపంగు వెంకన్నకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో విద్య, సాహిత్య రంగాల్లో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.



# మరిపెడలో ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి

**మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు**

**దేశ టైమ్స్ మహబూబాబాద్‌సెప్టెంబర్ 9:**

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని మరిపెడ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డితో కలిసి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు తెలుగు సాహిత్యానికి, తెలంగాణ ప్రజా ఉద్యమానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ప్రజల సమస్యలను తన రచనలు, కవితల ద్వారా సమాజం ముందుకు తీసుకువచ్చిన కాళోజీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. సామాన్య ప్రజల పక్షాన నిలిచి, ప్రజల గొంతుకగా తన రచనలను కొనసాగించిన కాళోజీ సాహిత్య సేవలు చిరస్మరణీయమని అన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జాటోతు సురేష్, మెరుగు రాము, కాంతమ్మ కరణ్ సింగ్, పానుగోతు రాములు, గంట్ల గౌతమ్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజోద్దీన్, గుగులోత్ లచ్చిరాం, గంట్ల మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొని కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు.



# దళితులను అవమానిస్తే తగిన మూల్యం తప్పదు

**బీఆర్ఎస్ నేతల తీరుపై మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల యాదగిరి ఆగ్రహం**

**వలిగొండ, సెప్టెంబర్ 09 (దేశ టైమ్స్):**



దళితుల ఓట్లతో పదేళ్లు అధికారాన్ని అనుభవించిన బీఆర్ఎస్ నాయకులు అదే దళితులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే అవమానించేలా వ్యవహరించడం వారి దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని మాల మహానాడు యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల యాదగిరి తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దళిత, గిరిజనులు ఎన్నో త్యాగాలు చేశారని, వారి త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ నేతలు అదే దళిత సమాజాన్ని చిన్నచూపు చూడటం సిగ్గుచేటని విమర్శించారు. దళితులు తమకు వ్యతిరేకంగా నినాదాలు చేశారనే కారణంతో అవమానించేలా వ్యవహరించడం, వారు రోడ్డుపైకి వచ్చారనే కారణంతో పసుపు నీళ్లు చల్లడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు, మానవత్వానికి, సామాజిక సమానత్వానికి విరుద్ధమన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించేది లేదని యాదగిరి హెచ్చరించారు. "అధికారంలోకి రావడానికి దళితుల ఓట్లు కావాలి కానీ దళితులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే అంటరానివారిలా చూస్తారా?" అని బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులను గౌరవించకుండా, వారి ఆత్మగౌరవాన్ని అవమానిస్తూ తిరిగి అధికారంలోకి రావాలని కలలు కనడం బీఆర్ఎస్ నాయకుల భ్రమ మాత్రమేనన్నారు. దళితులను కేవలం ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు కాలం చెల్లిందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లోని దళిత నాయకులు ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. "మన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి ఎవరి కింద పనిచేస్తున్నాం? మన సమాజాన్ని అవమానించే నాయకత్వంతో ఇంకా ఎందుకు కొనసాగాలి?" అని ప్రశ్నించారు.ఇది రాచరిక వ్యవస్థ కాదని ప్రజాస్వామ్య భారతదేశమని గుర్తుచేశారు. దళిత సమాజాన్ని తక్కువగా అంచనా వేయడం ఏ రాజకీయ పార్టీకి మంచిది కాదని హెచ్చరించారు. దళితుల ఐక్యతను తక్కువగా అంచనా వేస్తే రాజకీయంగా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని యాదగిరి స్పష్టం చేశారు.

# "ఒక్క మెతుకు పొలిమేర దాటదు".. 'రణబాలి'గా గర్జించిన విజయ్ దేవరకొండ.. పవర్ ఫుల్ టీజర్ ఇదిగో!

**విడుదలైన విజయ్ దేవరకొండ 'రణబాలి' టీజర్**

**బ్రిటిష్ కాలం నాటి కరవు నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామా**

**గూస్‌బంప్స్ తెప్పిస్తున్న విజయ్ మాస్ డైలాగ్, ఎంట్రీ**

**రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణం**

**దసరా కానుకగా అక్టోబర్ 16న సినిమా విడుదల**

రౌడీ హీరో విజయ్ దేవరకొండ చాలా కాలం తర్వాత తన అభిమానులు కోరుకుంటున్న అసలైన మాస్ అవతారంలోకి మారిపోయారు. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తూ సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చింది.టీజర్ ఆద్యంతం భావోద్వేగభరితంగా, ఉత్కంఠగా సాగింది. బ్రిటిష్ పాలనలో 'అన్నపూర్ణ దేశం' ఆకలితో అలమటిస్తున్న దృశ్యాలు, గుప్పెడు గింజల కోసం ప్రజలు పడుతున్న కష్టాలు హృదయాలను కదిలించాయి. ఈ క్రమంలో విజయ్ దేవరకొండ ఎంట్రీ, ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచాయి. "సింగనమల బొబ్బిలి రణబాలిరా నీ అక్కా..!! ఆ కొండమీదున్న మా భద్ర మల్లన్న మీద ఆనా.. నేను కాయలి కాస్తుండగా.. ఒక్క మెతుకు కూడా పొలిమేర దాటదు చెబుతున్నా" అంటూ విజయ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, పాత్రలో లీనమైన తీరు మునుపటి చిత్రాలకు భిన్నంగా ఉన్నాయి.1854-1878 మధ్య కాలంలో, ముఖ్యంగా 1876-78లో వచ్చిన భయంకరమైన కరవు నేపథ్యంలో ఈ చిత్రం వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతున్నట్టు టీజర్ స్పష్టం చేసింది. "సముద్రాలు దాటి వచ్చిన రాకాసులు కరవు రాక్షసులుగా మారితే.. ఆకలితో చనిపోయిన 80 లక్షల మంది ఆవేశాన్ని సమాధి చేయలేరు" వంటి వాక్యాలు కథలోని తీవ్రతను, పోరాట స్ఫూర్తిని తెలియజేస్తున్నాయి.ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, టీ-సిరీస్ సమర్పిస్తోంది. విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ క్రూరమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. భారీ సెట్లు, యాక్షన్ ఘట్టాలు, నేపథ్య సంగీతం సినిమా స్థాయిని పెంచాయి. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. టీజర్‌తోనే సినిమాపై భారీ హైప్ క్రియేట్ అవడంతో, విజయ్ కెరీర్‌లో 'రణబాలి' ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.



Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280